క్లుప్తంగా

తపాలా సేవలు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న చంద్రశేఖరరెడ్డి

పొదిలి: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో డాక్ చౌపోల్ కార్యక్రమం నిర్వహించారు. గిద్దలూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. పోస్టాఫీసులోని సేవింగ్స్, బీమా పథకాలు, డిజిటల్ ఖాతాల గురించి వివరించి, వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కంభం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మహ్మద్ ఆలీ, పొదిలి హెచ్‌ఓ సిబ్బంది, గ్రామీణ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటలతో శారీరక, మానసికోల్లాసం


క్రీడలపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం మౌలాలీ

తర్లుపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో రోజు శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. లింగారెడ్డి కాలనీలో హెచ్‌ఎం మౌలాలి పాల్గొని విద్యార్థులకు స్పోర్ట్స్‌పై అవగాహన కల్పించారు. మండలంలోని పలు పాఠశాలల్లో స్పోర్ట్స్ డే నిర్వహించారు. క్రీడలతో మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడా పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

వెంకట రమణయ్య 134 జయంతి వేడుకలు


రమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాచ్చా, శాంసన్ తదితరులు

పొదిలి: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134 జయంతి వేడుకలు స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వ్యవస్థ ఏర్పాటుకు రమణయ్య చేసిన కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి హుస్సేన్ పాచ్చా, గ్రంథ పాలకులు శాంసన్, నరసింహం, సురేంద్ర, పందిటి సాగర్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

కంభం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఔరంగబాద్ పంచాయతీలో సోమవారం ఆమె పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వరికుంట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

చోరీ విద్యుత్ సామగ్రి కొనుగోలు చేయొద్దు

- సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక


స్క్రాప్ యజమానులకు సూచనలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో దొంగిలించిన మోటార్లు, కాపర్‌వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ తీగను గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. అటువంటి వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. బుధవారం పట్టణ పరిధిలోని స్క్రాప్ దుకాణాల యజమానులను తన కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను కట్టడి చేసేందుకు సహకరించాలని, లేదంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు


భూగర్భ జలాలు అందక పోవడంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న సింగిల్ ఫేస్ బోరు


అక్కపల్లెలో సింగిల్ ఫేస్ మోటార్ వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు


జేపీ చెరువు రామాలయం వద్ద ఒట్టిపోయిన సింగిల్ ఫేస్ మోటార్

రాచర్ల: సకాలంలో వర్షాలు కురువక పోవడంతో పూర్తి స్థాయిలో భూగర్భ జలాలు అడుగంటాయి. బిందె తాగునీటి కోసం అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోసం వచ్చిన అధికారులు కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లోనే కాలాన్ని వెళ్లబుచ్చుకుని సాయంత్రం ఇంటికి వెళ్తున్నారు. గ్రామాల్లోని ప్రజలు ఎలాంటి సమస్యలతో బాధపడుతున్నారో.. అనే విషయాన్ని పక్కన బెట్టి బదిలీలు ఎప్పుడు వస్తాయో.. ఇక్కడి నుంచి ఎప్పుడు వెళ్లిపోవాలా అనే ఆలోచనలో అధికారులు ఉండటంతో సచివాలయ అధికారులు నామ మాత్రంగా విధులు నిర్వహించుకుని వెళ్లిపోతున్నారు. గడిచిన మూడు నెలలుగా మండలంలోని జేపీ చెరువు, అక్కపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో తాగునీటి కోసం గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జేపీ చెరువు గ్రామంలో 17 సింగిల్ ఫేస్ మోటార్లు, 2 త్రీఫేస్ మోటార్లు ఉన్నాయి. సకాలంలో వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అందక పోవడంతో కేవలం రెండు సింగిల్ ఫేస్ మోటార్లకు మాత్రమే తాగునీరు వస్తుంది. మిగిలిన 15 సింగిల్‌ఫేస్ మోటార్లు పూర్తిగా ఒట్టిపోయాయి దిష్టిబొమ్మలాగా దర్శనమిస్తున్నాయి. ఒక త్రీఫేస్ మోటారు మరమ్మతులకు గురికాగా మరో బోరుకు కొద్దిపాటిగా నీరు వస్తుందని గ్రామంలోని ప్రజలు వివరించారు. చోళ్లవీడు పంచాయతీ పరిధిలోని అక్కపల్లె గ్రామంలో మూడు నెలలుగా తాగునీటి కోసం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉందని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం ఖాళీ బిందెలను తీసుకుని సింగిల్‌ఫేస్ మోటార్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో చర్యలు తీసుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దటి లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యల మధ్య.. బాలల విద్య!


బాటిళ్లతో నీళ్లు తెచ్చుకుని మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

- కొనకనమిట్ల మండలం పాతపాడు ప్రాథమిక పాఠశాలలో వసతులు మృగ్యం
- మరో 11 పాఠశాలల్లోనూ వెంటాడుతున్న సమస్యలు
- గత ప్రభుత్వంలో 77 పాఠశాలల్లో నాడు–నేడు కింద 65 స్కూళ్లలో వసతులు
- మిగిలిన పాఠశాలలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని వినతులు

కొనకనమిట్ల: మండలంలోని పాతపాడు ఎస్సీ కాలనీలోని హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 29 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో కొందరిని గదిలో, మరికొందరిని వరండాలో కూర్చోబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగానే ఉన్నా మంచి నీరు లేకపోవడంతో హెచ్‌ఎం రోజూ మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. విద్యార్థులు కూడా బాటిళ్లతో ఇంటి నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడం, మరుగుదొడ్లు మరమ్మతులకు గురికావడంతో అవస్థలు పడుతున్నారు. పాఠశాల ముందు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. తీగల మధ్య జాయింట్లు వేసి ఉండటంతో ఈదురు గాలులకు తెగిపడే ప్రమాదం ఉంది. సమస్యను లైన్‌మన్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి మండలంలో మొత్తం 77 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద రెండు విడతల్లో 65 స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగు పరిచారు. అందుకుగాను రూ.5.40 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన 12 పాఠశాలలను మూడో విడతలో బాగు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. నూతన ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఈ 12 పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన మరుగుదొడ్లు


పాఠశాల ముందు జాయింట్లతో విద్యుత్ తీగ

రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం


ఢిల్లీలో మాజీ ఎమ్మెల్యే కేపీతో కంభం వైఎస్సార్ సీపీ నాయకులు


ఢిల్లీలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పార్టీ నాయకులు

- ఢిల్లీ ధర్నాలో వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం/కొనకనమిట్ల: రాష్ట్రంలో టీడీపీ కూటమి నేతల హత్యాకాండ, దాష్టీకాలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో మార్కాపురం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, వెలిగండ్ల, మునగపాడు సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డి, పార్లపల్లి సిద్దానభి, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, చంద్రశేఖర్, సేవాదళ్ నాయకులు మందలపు శ్రీనివాసులరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తమ నిరసన తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాన్ని అడ్డుకోవడంలో సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు.

ధర్నాకు కంభం వైఎస్సార్ సీపీ నాయకులు

కంభం: ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం చేపట్టిన ధర్నాకు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనలో పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలు దేశంలో ఎక్కడ జరిగినా పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. మండలానికి చెందిన బాజిద్, జాకీర్, ఎంపీటీసీ రఫీ, వెంకటేశ్వరరెడ్డి, గురుమూర్తి పాల్గొన్నారు.

వీఆర్‌ఓల పనితీరుతోనే రెవెన్యూ వ్యవస్థకు మంచిపేరు


మాట్లాడుతున్న చిన్న ఆదిరెడ్డి

పొదిలి: రెవెన్యూ వ్యవస్థలో క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్‌ఓల పనితీరును బట్టే మంచి పేరు వస్తుందని వీఆర్‌ఓ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి చిన్న ఆదిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక ఎన్జీఓ హోంలో కనిగిరి డివిజన్ వీఆర్‌ఓ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యలపై సంప్రదించే ప్రజలతో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారంలో సాధ్యాసాధ్యాలను వారికి వివరించాలన్నారు. పెద్ద సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనల మేరకు పరిష్కరించాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల మంజూరులో కాలయాపన లేకుండా అర్జీదారుని రికార్డులు పరిశీలించి వెంటనే ఇవ్వాలన్నారు. వీఆర్‌ఓల సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో కనిగిరి డివిజన్ అధ్యక్షుడు ఎం.రమేష్, జిల్లా కోశాధికారి కూకట్లపల్లి జానయ్య, డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును పరిశీలించిన ఎంపీడీవో


ఆధార్ సర్వీసులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తోట చందన


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లిలో ఆధార్ క్యాంపును బుధవారం మార్కాపురం ఎంపీడీఓ తోట చందన పరిశీలించారు. ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జమ్మనపల్లిలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఆధార్ క్యాంపులో బయోమెట్రిక్ అప్‌డేషన్, న్యూ ఎన్‌రోల్‌మెంటు, ఆధార్, మొబైల్‌లింకు తదితర సర్వీసులను పొందవచ్చని అన్నారు. మొత్తం 26 మంది ఆధార్ సర్వీసులను వినియోగించుకున్నారని తెలిపారు. గజ్జలకొండలో నిర్వహించిన ఆధార్‌క్యాంపులో 38 మంది సేవలను ప్రజలు వినియోగించుకున్నారు. 25వ తేదీ గురువారం గజ్జలకొండ సచివాలయం ఆధార్ క్యాంపు కొనసాగుతుంది. రెండవ ఆధార్ క్యాంపు నికరంపల్లి సచివాలయంలో నిర్వహిస్తారని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని సచివాలయం–5లో ఆధార్ శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ కిరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రానికి వచ్చేవారికి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలో ప్రైమరీ, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ మోహన్‌నాయక్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్


మాట్లాడుతున్న సీఐ మల్లిఖార్జునరావు

పొదిలి: ఆటో డ్రైవర్లకు, యజమానులకు సీఐ మల్లిఖార్జునరావు బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు వాహనాలు నడుపుకోవాలని సూచించారు. సరైన పత్రాలు కలిగి ఉండాలని, రిజిస్ట్రేషన్ నంబర్ సక్రమంగా ఉండాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలు నడిపేటప్పుడు, పార్కింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జి.కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గాడిద పాలకు డిమాండ్


అనుమలవీడులో గాడిద పాలు విక్రయిస్తున్న మహిళ

రాచర్ల: గాడిద పాలకు భారీ డిమాండ్ ఉండటంతో గ్రామాల్లో గాడిద పాలు విక్రయిస్తున్నారు. మండలంలోని అనుమలవీడు, రాచర్ల గ్రామాల్లోని గాడిదను పట్టుకుని వీధుల్లో తిరుగుతూ మహిళలు గాడిద పాలు విక్రయిస్తున్నారు. గాడిద పాలను తాపించడం ద్వారా దమ్ము, టీబీ, దగ్గు, జలుబు, కడుపునొప్పి, ఉబ్బసం, చిన్న పిల్లలను కపాడుతుందని చాలా మంది భావిస్తున్నారు. 50 ఎంఎల్ గాడిద పాలు 100 రూపాయలకు అమ్ముతున్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Patamata Branch, VJA వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ కాపురస్తులు అబ్బూరి వెంకట రమణ గారి కుమారుడు అబ్బూరి బాల వెంకట నాగరాజుగారు ది. 18-02-2016న చేసిన సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.1119/2016 (యస్.ఆర్.ఓ., దర్శి) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటుకు మార్టుగేజ్ చేసుకొని అబ్బూరి బాల వెంకట నాగరాజు గారి పేరు మీద లోను పొందుతున్నారు. సదరు అబ్బూరి బాల వెంకట నాగరాజు గారికి లోను ఇచ్చుటకు ఏవరికైనను ఎటువంటి కోర్టు ఎటాచ్మెంట్లు గాని, క్లయిములు గాని మరియు ఏ ఇతర అభ్యంతరములు ఉన్న యెడల వారి అభ్యంతరములను ఈ క్రింది అడ్రస్సుకు 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయ గలరు. ఆపై వచ్చు క్లయిములు గాని, అభ్యంతరములు గాని, నా క్లయింటును బైండ్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, మార్కాపురం రి.డి. దర్శి స.డి.లోని దొనకొండ మం., దొనకొండ ఆర్.యస్.నెం. 203కుగల మెట్టభూమిలోని ప్రస్తుతం దొనకొండ గ్రామంలో చేసిన దొనకొండ నెమీదే దోకు నెం.2-183ను, గ్రామ సర్వే నెం. 200/1, 200/2ను దాఖలా చ.గ.లు 266.2లో గల ఖాళీ స్థలమునకు హద్దులు: తూర్పు: రోడ్డు: దక్షిణం: వక్కా శ్రీమగారి స్థలము; పడమర: రోడ్డు: ఉత్తరం: అబ్బూరి వెంకటేశ్వర్లుకు చెందిన స్థలం

ఇట్లు
T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., Vijayawada. ✆ 9849431432

వజ్రాల వేటకు వెళ్లి తప్పిపోయిన యువకుడు


బత్తుల రామాంజనేయులు

పొదిలి రూరల్: పొదిలి మండలం కొండాయపాలెం పంచాయతీలోని సలకనూతల గ్రామానికి చెందిన యువకుడు వజ్రాల వేటకు వెళ్లి తప్పిపోయిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బత్తుల సుందరరావు, చెన్నమ్మ దంపతుల కుమారుడు బత్తుల రామాంజనేయులు రెండు వారాల క్రితం తన తల్లి చెన్నమ్మ, మరి కొంత మంది గ్రామస్తులతో కలిసి వజ్రాల వేటకని కర్నూలు జిల్లా జొన్నగిరి ప్రాంతానికి వెళ్లారు. అక్కడ రెండు, మూడు రోజులు ఉన్న తరువాత చెన్నమ్మ కుమారుడు బత్తుల రామాంజనేయులు ఇంటికి వెళ్తానంటే తల్లి డబ్బులు ఇచ్చి పంపించింది. కొద్దిగా మతిస్థిమితం లేని ఈ వ్యక్తి ఇంటికి రాలేదు. కుమారుడు అక్కడ నుంచి బయలు దేరిన మూడు రోజులకు తల్లి ఇంటికి వచ్చింది. కుమారుడు ఇంటికి రాని విషయాన్ని తెలుసుకొని పలు చోట్ల విచారించింది.

దోమల నివారణకు ఫాగింగ్

దర్శి: పట్టణంలోని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ మహేష్ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మోటార్ సైకిల్‌పై ఫాగింగ్ యంత్రాలతో వీధి వీధిలో తిరిగి ఫాగింగ్ చేశారు. ఇటీవల కురిసిన చిరు జల్లులకు దోమలు వృద్ధి చెందాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దోమకాటుతో వ్యాపించకుండా దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ పొగను వీధుల్లో కొట్టారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో 86, 87 నంబర్ అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్‌లు, స్టాక్ రిపోర్ట్‌లు పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. పాఠశాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఆముదపు పంటలో మెళకువలు పాటించాలి


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారి

గిద్దలూరు రూరల్: ఆముదపు పంటలో రైతులు మెళకువలు పాటించాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దిగువమెట్టలో ఆముదపు పంటలను బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 250 హెక్టార్లలో ఆముదపు పంట సాగు చేస్తున్నారని చెప్పారు. ఆముదపు పంటలో దాసరి పురుగు నామాల పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లద్దెపురుగు తొలిదశలో ఆకులను గీకి తర్వాత దశలో రంధ్రాలను ఏర్పాటు చేస్తూ పంటను నాశనం చేస్తుందన్నారు. రైతులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.